
సాక్షి
బాపట్ల
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 6,709 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

భృంగి వాహనంపై ఊరేగిన మల్లేశ్వరుడు



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుని దర్శించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి వారి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూలమార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెద కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, కృష్ణకుమారి దంపతులు, ఎల్‌కే శర్మ, ఇందిరాదేవి దంపతులు భృంగి వాహన ఉత్సవానికి కై ంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వరికపూడిసెల నిర్మాణానికి సహకరించండి

పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు



నరసరావుపేట: ఏడు దశాబ్దాల పల్నాడు వాసుల కల, అతిపెద్ద నీటి ప్రాజెక్టు వరికపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించి కావాల్సిన అనుమతులు జారీ చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలో ఏడీజీ (అడిషనల్ డైరెక్టర్ జనరల్) బివాష్‌రంజన్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు. మంగళవారం ఢిల్లీలో బివాష్ రంజన్‌ను ఎంపీ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్లియరెన్స్‌లు పొందడానికి అవసరమైన డీపీఆర్ సహా అన్నీ ప్రక్రియలను పూర్తి చేసిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో ముఖ్య భాగాలైన పంప్‌హౌస్, ప్రెజర్ మెయిన్, బ్రేక్ ప్రెజర్ ట్యాంక్, ఇతర నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూమి అటవీ ప్రాంతంలో ఉందన్నారు. ఇది రాజీవ్ గాంధీ వన్యప్రాణుల అభయారణ్యం, నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలోని ప్రధాన ప్రాంతమని వెల్లడించారు. 19.13 హెక్టార్ల భూమి మళ్లింపును వేగవంతం చేయాలని విన్నవించారు. జిల్లాలోని వెల్దుర్తి మండలం గంగుల కుంట గ్రామం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మించాల్సిఉందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే భారీ ఎత్తున సాగు, తాగునీటి సమస్య తీరుతుందని విజ్ఞప్తి చేశారు.

18న ఏలేశ్వరస్వామి గుట్టకు లాంచీ సర్వీసులు

పర్యాటక శాఖ మేనేజర్ భైరవస్వామి



విజయపురిసౌత్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీ ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ఏలేశ్వరస్వామి గుట్ట (మల్లయ్య గట్టు)కు ప్రత్యేక లాంచీ సర్వీసు తిప్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్థానిక లాంచీస్టేషన్ మేనేజర్ భైరవ స్వామి మంగళవారం తెలిపారు. ఆయన మంగళవారం విలేకరలతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లాంచీ సర్వీసులు అనుపు నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అనుపు నుంచి ఏలేశ్వరగట్టుకు వెళ్లేందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టిక్కెట్ ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అనుపులో అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 97051 88311ను సంప్రదించాలన్నారు. ఆయన వెంట వినయతుల్లా, సిబ్బంది ఉన్నారు.

సాహిత్యంపై అనురక్తి.. సేవలో తృప్తి

- సాహిత్య, సామాజిక సేవకుడు పుట్టంరాజు
- ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నప్పటి నుంచి సాహిత్యంపై మక్కువ
- పలు గ్రంథాలు, గజల్స్ రచన
- తల్లిదండ్రుల పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు



ఐదవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో సభామిత్ర పురస్కారం అందుకుంటూ.. (ఫైల్)



విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లు అందజేస్తున్న పుట్టంరాజు

అద్దంకి రూరల్: సొంత లాభం కొంత మానుకుని పరులకు సాయపడాలన్న ఆశయంతో విశాంత్ర ప్రధానోపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సామాజిక, సాహిత్య సేవల్లో తరిస్తున్నారు. అందరి ప్రశంసలు, ఎన్నో అవార్డులు అందుకున్నారు. అద్దంకి మండలం తిమ్మాయపాలెం గ్రామంలో జన్మించిన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి చదువుకునే రోజుల నుంచి సాహిత్యంపై మక్కువ పెంచుకుని అందులో పట్టుసాధించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సమయంలోనే ఆణిముత్యాలు, పసిడి పలుకులు, తెలుగు వెలుగులు, తేటగీతి, హృదయ గీతి, పుట్టంరాజు గజల్స్ రాశారు. అవి 2020 ప్రకాశం జిల్లా స్వర్ణోత్సవ సంచికలో భాగమైపోయాయి. గణిత ఉపాధ్యాయుడైన శ్రీరామచంద్రమూర్తి సంఖ్యా సిద్ధాంతం, బహుళపది సిద్ధాంతం పుస్తకాలను పిల్లలకు తేలికగా అర్థమయ్యే విధంగా రచించారు.



పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి

అన్నీతానై సాహిత్య కార్యక్రమాల నిర్వహణ..

అద్దంకి సృజన సాహిత్య సంఘానికి అధ్యక్షుడుగా, ఆ సంఘ అవార్డు కమిటీ కార్యదర్శిగా, జానపద కళాపీఠం కార్యదర్శిగా శ్రీరామచంద్రమూర్తి పనిచేస్తున్నారు. వీటితో పాటు పలు సాహితీ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుంటారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శిగా సంగీత కార్యక్రమాల నిర్వహణలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. తన తల్లిదండ్రుల పేరుతో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా సాహితీవేత్తలకు పురస్కారాలు, నగదు బహుమతులు అందజేస్తున్నారు. అద్దంకిలో తొలి పద్యశాసనం, ఎర్రాప్రగడ విగ్రహ ఏర్పాటులో పుట్టంరాజు పాత్ర ప్రశంసనీయమైంది.

తల్లిదండ్రుల పేరుతో చారిటబుల్ ట్రస్ట్..

తన తల్లిదండ్రులు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ పేరుతో 2004లో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామమైన తిమ్మాయపాలెంలో రెండు పాఠశాలలకు ఆర్చిలు, బెంచీలు, కుర్చీలు, బల్లలు, నీళ్ల ట్యాంక్ నిర్మించారు. క్రమం తప్పకుండా ప్రతి ఏడాది నోట్ పుస్తకాలు అందజేస్తున్నారు. మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, రాష్ట్ర స్థాయిలో ఎపిఫణి సంస్థ ద్వారా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. కోవిడ్ సమయంలో రెండేళ్లు రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి పేదలకు నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. నిత్యం పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తుంటారు.

ప్రశంసలు, అవార్డులు..

రామచంద్రమూర్తి ప్రముఖుల ప్రశంసలతో పాటు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో సభామిత్ర పురస్కారం పొందారు. 2022లో గురుపూజోత్సవం సందర్భంగా గురు ప్రపూర్ణ అవార్డు, 2018లో 72వ స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్తమ సేవా ప్రశంస పత్రాన్ని అప్పటి కలెక్టర్ వినయ్‌చంద్ చేతులమీదుగా అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ప్రశంసా పత్రం, జాతీయ గ్రంథాలయ శాఖ వారోత్సవాల్లో రాష్ట్ర స్థాయి బుక్‌పబ్లిష్ పోటీలో మొదటి బహుమతి పొందినందుకు రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ అభినందిస్తూ ప్రశంస పత్రం అందజేసింది.

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సుధాకర్

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి ఉచితంగా జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, స్టోర్ అసిస్టెంట్ అసోసియేట్ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇప్పటికే వివిధ రకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

సంస్థ ద్వారా రెండో విడతలో భాగంగా రేపల్లె పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి ఆయా కోర్సుల్లో శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఆయా కోర్సులకు తమ విద్యార్హతలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోని నైపుణ్యాభివృద్ధి సిబ్బందినిగాని, 93474 68946 నంబరునుకాని సంప్రదించాలని పేర్కొన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్స్ యాప్ డౌన్లోడ్ చేసుకుని తమ వివరాలు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం పదిలం



విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

సైకిల్ తొక్కిన కలెక్టర్ విజయకృష్ణన్

చీరాల: రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఆరోగ్యం కోసం మంగళవారం చీరాలలో సైకిల్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె బెలూన్‌లను ఎగురవేసి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఒకటిన్నర కిలోమీటర్ సైకిల్ తొక్కారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కూరగాయల మార్కెట్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా మన ప్రాణాలను రక్షించుకోవచ్చని చెప్పారు. నిరంతరం సైకిల్ తొక్కడం వల్ల శరీర దారుఢ్యం మెరుగవుతుందని, మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చన్నారు. వాహనాల వినియోగం తగ్గితే పెట్రోల్, డిజిల్ కొరతను అధిగమించవచ్చన్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ విజయమ్మ, ఆర్డీవో పి.సరోజిని, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, మున్సిపల్ కమిషనర్ యేసయ్య, తహసీల్దార్ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: మహిళల మెడల్లోని బంగారు గొలుసులను అపహరించే అంతర్ జిల్లాల దొంగల ముఠాను ఎట్టకేలకు చీరాల 1టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్ వివరాలను వెల్లడించారు. నెల్లూరు జిల్లా వింజమూరు మండలం కోకవారిపాలెం గ్రామానికి చెందిన మల్లి శశికుమార్, ఈర్ల విజయ్‌తో పాటు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకొలికొండి గ్రామానికి చెందిన కర్ణకంటి తిరుపతిరావు స్నేహితులు. విలాసవంతమైన జీవితంతో పాటు చెడు వ్యసనాలకు బానిసలై ఖర్చుల కోసం బైక్‌లపై వెళుతూ మహిళల మెడల్లోని గొలుసులను లాక్కెళ్లడం వీరికి షరా మామూలైంది. దానిలో భాగంగా వీరు చీరాల, నెల్లూరు, కావలి, గుంటూరు వంటి నగరాల్లో ఈ తరహా దొంగతనాలకు పాల్పడ్డారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. మంగళవారం చీరాల 1 టౌన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు కత్తి చూపించి మహిళలను బెదిరిస్తున్నారన్న సమాచారం అందడంతో అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4.45 లక్షల విలువ కలిగిన 91 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభచూపిన చీరాల వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు, వన్ టౌన్ ఎస్ఐ ఎ.చంద్రశేఖర్, ఏఎస్ఐ ఎన్.సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ టి.శ్రీనివాసరావు, యు.లక్ష్మణ్, కానిస్టేబుల్ పి.కృష్ణ, హోంగార్డు కె.పరమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అభినందించిన వారిలో చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ ఉన్నారు.



ఘనంగా ధ్యానబుద్ధవనం ప్రారంభోత్సవం



రావి మొక్కను నాటుతున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, ఆర్కే రోజా, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అమరావతిలో నిర్మించిన ధ్యానబుద్ధవనాన్ని మంగళవారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. తొలుత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. మంత్రులకు స్థానిక శాసన సభ్యుడు నంబూరు శంకరరావు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. మంత్రులిద్దరూ అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటంతో పాటుగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ధ్యానబుద్ధ విగ్రహం వద్ద బుద్ధుడి విగ్రహానికి పూజలు చేసి ధ్యానబుద్ధవనంలో ఆడిటోరియం, ధ్యాన మందిరం, లేజర్‌షో, ఫుడ్ కోర్టుతో పాటుగా ఇంటర్‌ప్రిడిక్షన్ సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. తామ్ర ఫలకాన్ని ఆవిష్కరించారు. ధ్యాన బుద్ధవనం ఆవరణలో రావి మొక్కను నాటారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానిక పురావస్తు సంగ్రహనశాలను సందర్శించి అక్కడ బౌద్ధమత విశిష్టతను తెలిపే శిల్పాలను తిలకించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ, ఏఎస్ఐ అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం మంగళవారం 557.50 అడుగుల వద్ద ఉంది. ఇది 226.6060 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,104, ఎడమ కాలువకు 8,986 ఎస్‌ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 20,520 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,520 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 833.60 అడుగుల వద్ద ఉంది. ఇది 53.3713 టీఎంసీలకు సమానం.

యార్డుకు 1,40,104 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,40,104 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,37,168 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు దక్కింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 94,377 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దేశంలో అసహనం పెరిగిపోతుంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో శాస్త్రీయంగా ఆలోచించాలని చెబుతుంటే అసహనం పెరిగి దాడులకు తెగబడుతున్నారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ నన్నపనేని అంజయ్య అన్నారు. విశాలాంధ్ర పబ్లిషర్స్ ఆధ్వర్యంలో ముద్రితమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ దేవరాజు మహారాజ్ రచించిన 'దేశంలో గౌరవనీయమైన మూర్ఖులు' మరో రచయిత ఎం. పార్థసారధి రచించిన 'నవలాలోకం' పుస్తకావిష్కరణలు 33వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రాంగణంలోని గొల్లపూడి సాహితీవేదికపై మంగళవారం రాత్రి జరిగింది. డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ మనిషిని గౌరవించలేని వ్యక్తులు పశువులకు మాత్రం ఎక్కడాలేని విలువనిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించమని కోరితే ఆవుపేడ కోసం పరిశోధనలంటూ పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరో సాహితీవేత్త శ్రీనివాసరావు, బుక్ హౌస్ సంపాదకులు గద్దం కోటేశ్వరరావు, మేనేజర్ మనోహరనాయుడు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బహుజన సాహిత్యం – నేటి అవసరంపై చర్చ

వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో 'బహుజన సాహిత్యం – నేటి అవసరం' అంశంపై చర్చ, 24 మంది సంక్షిప్త జీవిత చరిత్రల పరిచయ కార్యక్రమాన్ని విజయవాడ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బొర్రా గోవర్ధన్, వీజీఆర్ నారగోని, ఆకురాతి మరళీకృష్ణ, కృష్ణార్జున బోధి, యింద్రవెల్లి రమేష్ ప్రసంగించారు.

ఆపాదమస్తకం.. పుస్తకం

- సాహితీ సుగంధాలు వెదజల్లుతున్న విజయవాడ పుస్తక మహోత్సవం
- మోదీ 20 ఏళ్లు సృష్టించారు.. సాధించారు పుస్తకావిష్కరణ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- దేశాన్ని ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత మోదీదేనని ఉద్ఘాటన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ప్రకాష్ జవదేకర్, ఏపీ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ దేవధర్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఐవైఆర్ కృష్ణారావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవం సాహితీ ప్రియులకు మరపురాని అనుభూతులను మిగిల్చుతోంది. సాయం సంధ్యా వేళలో వేల సంఖ్యలో కొలువుదీరిన పుస్తక నేస్తాలు ఆహ్వానం పలుకుతుండగా.. రోజూ పలు వేదికలపై జరుగుతున్న సాహితీ చర్చలు, పుస్తకావిష్కరణలు ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఆర్థిక శక్తిగా భారత్..

కరోనా వంటి సంక్షోభాలు వెంటాడుతున్నా దేశాన్ని ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎమెస్కో పబ్లిషర్స్ అనువాద ముద్రణ 'మోదీ 20 ఏళ్లు సృష్టించారు.. సాధించారు' పుస్తకావిష్కరణ కార్యక్రమం 33వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై మంగళవారం రాత్రి జరిగింది.

ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో కలసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా తాకిడికి చైనా, అమెరికా, యూకే, సింగపూర్ వంటి దేశాలు దారుణంగా ప్రభావితమయ్యాయన్నారు. కానీ యూకే వంటి అభివృద్ధి చెందిన దేశాన్ని పక్కకునెట్టి భారతదేశం ఐదో పెద్ద ఆర్థికశక్తిగా ఎదగటంలో నరేంద్రమోదీ నాయకత్వ పటిమ దాగుందని అన్నారు.

ప్రతి రోజూ సవాళ్లు ఎదురవుతున్నా అద్భుతమైన పరిపాలనను అందిస్తున్న మోదీ నాయకత్వం దేశానికి మరింత అవసరమన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతకలహాలు, కర్ఫ్యూ, ఉగ్రవాద దుశ్చర్యలు వంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. మోదీ నాయకత్వంలో అవినీతి, ఉగ్రవాదాలను పూర్తిగా తరిమికొట్టడంలో విజయవంతం సాధించామని చెప్పారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య శత జయతి రోజున ఈ పుస్తకం తెలుగులో అనువాదం కావటం ఆనందంగా ఉందని చెప్పారు. మోదీ పరిపాలన, నాయకత్వ పటిమలపై 20 మంది ప్రముఖులు రాసిన వ్యాసాల సంకలనాన్ని తెలుగులో అనువదించటం అభినందనీయమన్నారు.

వినూత్న పాలన..

కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ దేశంలో వినూత్నమైన నూతన పాలనవిధానాలతో ప్రధాని మోదీ దేశాభ్యున్నతిని పరుగులుపెట్టిస్తున్నారన్నారు. కోట్లాది మంది కుటుంబాలతో మన్‌కీబాత్ ద్వారా మాట్లాడుతున్నారన్నారు. విద్యార్థుల్లో సైతం ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ప్రసంగాలు చేస్తూ నేటి తరానికి స్ఫూర్తినింపుతున్నారన్నారు.

మోదీతో దేశాభ్యున్నతి..

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు మాట్లాడుతూ మోదీ నాయకత్వం దేశంలో అనేక అద్భుతాలు చేసిందన్నారు. దీనదయాళ్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ దేశాభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. ప్రధానిగా మోదీ దేశచరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని కైవసం చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్, ఎమెస్కో అధినేత డీ విజయకుమార్ పాల్గొన్నారు.

బంగారం ఆభరణాలు గంటల వ్యవధిలో స్వాధీనం

- 13 సవర్ల ఆభరణాలు అందజేత
- హర్షం వ్యక్తం చేసిన బాధిత మహిళ



బాధిత మహిళకు బంగారం ఆభరణాలను అందజేస్తున్న పర్చూరు ఎస్‌ఐ

బాపట్ల టౌన్: బంగారం ఆభరణాలు ఉన్న పర్సును మహిళ పోగొట్టుకున్న గంటల వ్యవధిలోనే పోలీసులు స్వాధీనం చేసుకుని ఆమెకు అప్పగించారు. వివరాలు.. పర్చూరుకు చెందిన వస్త్రాల వ్యాపారి బుర్ర మహాలక్ష్మి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో మందులు కొనుగోలు చేసేందుకు పర్చూరులోని శ్రీనివాస మెడికల్ దుకాణానికి వెళ్లారు. మందులు కొనుగోలు చేసే సమయంలో చేతిలో ఉన్న పర్సును మరిచిపోయారు. ఇంటికెళ్లి చూసిన తర్వాత పర్సు కనిపించకపోవడంతో వెంటనే సదరు మెడికల్ దుకాణానికి వెళ్లారు. అక్కడ కనిపించకపోవడంతో పర్చూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎస్‌ఐ చెంచుప్రసాద్ సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా 70 సంవత్సరాలు వయసు కలిగిన వృద్ధుడు షాపులోని పర్సును తీసుకున్నట్లు గుర్తించారు. అతడి గురించి ఆరా తీయగా ఉప్పుటూరు గ్రామానికి చెందిన షేక్ మౌలాలీగా నిర్ధారించారు. వెంటనే అతడి ఇంటికి వెళ్లి అతని వద్ద నుంచి పర్సును స్వాధీనం చేసుకున్నారు. అందులో నాలుగు బంగారు గాజులు, రెండుపేటల గొలుసు, ఒక ఉంగరం, నల్లపూసల గొలుసు మొత్తం 13 సవర్ల బంగారపు ఆభరణాలు, రూ.13,200 ఉన్నాయి. గంట వ్యవధిలోనే పోగొట్టుకున్న బంగారం ఆభరణాలు, నగదును తిరిగి తనకు అప్పగించిన పోలీసులకు రుణపడి ఉంటానని బాధిత తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పర్చూరు ఎస్‌ఐ చెంచు ప్రసాద్‌ను ఫోన్‌లో అభినందించారు.

ఫ్లెక్సీ తొలగిస్తూ యువకుడి మృతి

కారంచేడు: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని స్వర్ణ ఎస్సీ కాలనీకి చెందిన మట్టి అహరోను(19) ఫ్లెక్సీని తొలగిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాలనీలో ఇటీవల జరిగిన వివాహానికి సంబంధించి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం అదే కాలనీకి చెందిన అహరోను, తన స్నేహితుడు సలగల బాబు అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగిస్తున్నారు. ఫ్లెక్సీ బరువు ఉండటంతో సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో ఒక్క సారిగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి వెళ్లాడు. 108 సిబ్బంది వచ్చి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సలగల బాబుకు కూడా రెండు చేతులు కాలిపోయాయి. బాబును చీరాల ఆస్పత్రికి తరలించారు. అహరోను తండ్రి మృతి చెందగా, అక్కకు వివాహం జరిపించారు. తల్లి, కొడుకు మాత్రమే ఇంట్లో ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతుడు డిగ్రీ చదువుతున్నాడు. కొడుకు మృతితో తల్లి అనాథగా మిగిలిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

రాంబాబును పరామర్శించిన ఐజీ త్రివిక్రమవర్మ



రాంబాబును, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐజీ త్రివిక్రమ వర్మ

గుంటూరు ఈస్ట్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సైకిలిస్టును ఐజీ త్రివిక్రమవర్మ మంగళవారం పరామర్శించారు. వసంతరాయపురానికి చెందిన బండి రాంబాబు మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఆరోగ్యం కోసం నిత్యం సైకిల్ తొక్కుతుంటాడు. ఈనెల 12వ తేదీ అమరావతి రోడ్డులోని హోసన్న మందిరం వద్ద లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఐజీ త్రివిక్రమవర్మ రాంబాబును పలకరించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య అధికారులను ఏ మేరకు వైద్యం అందుతుంది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ ఈ ఘటన బాధాకరమన్నారు. ఘటనపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనం సీజ్ చేయడం జరిగిందన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుని రాంబాబు కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి మంచి వైద్యం అందించారని ప్రశంసించారు. తాను సైక్లిస్టు అసోసియేషన్ తరుపున బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయం ఇస్తున్నట్లు తెలిపారు. సైక్లిస్టు అసోసియేషన్ సభ్యుడు బండ్లమూడి సుబ్బయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరుపున రాంబాబు కుటుంబానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యుల నుంచి చందాలు వసూలు చేసి తగిన సహాయం ఆ కుటుంబానికి అందజేస్తామని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్ఎంఓ సతీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి నివారణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు



ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

పెదకాకాని(పొన్నూరు): ప్రతి రోజూ సైకిల్ తొక్కి వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ పేరిట పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ప్రధానసెంటర్ మీదుగా మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పెదకాకాని పీహెచ్‌సీ వైద్యాధికారి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి తగ్గుతుందనే అంశంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. సైకిల్ వ్యాయామం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చనున్నట్లు తెలిపారు. సైకిల్ వ్యాయామం అలవాటు చేయడం ద్వారా మన దేశంలోనూ క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయప్రసాద్, డాక్టర్లు అన్నపూర్ణ, లక్ష్మానాయక్, జె.నారాయణస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుట్ట దుర్గ, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలలో ప్రమాదాలపై 23న మాక్ డ్రిల్

డీఆర్వో చంద్రశేఖరరావు



మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖరరావు

గుంటూరు వెస్ట్: పరిశ్రమల్లో విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు, భారీ, అతి భారీ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 23న మాక్ డ్రిల్ నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ మాక్ డ్రిల్ రోజునే జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో దీనిని చేపట్టాలన్నారు. ముఖ్యంగా భారీ పేలుడు జరిగినప్పుడు, ప్రాణాంతక గ్యాస్ లీకైనప్పుడు, ఇతర ప్రమాదాలు ఏర్పడినప్పుడు కార్మికులకు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఎలా బయటపడాలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభమయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పారు. ఫ్యాక్టరీ యజమానులు కూడా సలహాలు, సూచనలు అందించడంతోపాటు వాటిని పాటించాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ శివ కుమార్‌రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ అస్లాం, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం

బాపట్ల టౌన్: జిల్లాలోని బాపట్ల, అద్దంకి బస్టాండ్‌ల్లో ఈనెల 16న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బస్టాండ్‌లను వాణిజ్య, వ్యాపార ప్రాతిపదికన, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న పారిశ్రామిక వేత్తలు ఉదయం 11 గంటలకు అద్దంకి డిపో, సాయంత్రం 4 గంటలకు బాపట్ల ఆర్టీసీ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కాలచక్ర మ్యూజియాన్ని సందర్శించిన కలెక్టర్

అమరావతి: అమరావతిలోని కాలచక్ర మ్యూజియాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం సందర్శించారు. మూతపడటానికి కారణాలు, తిరిగి వినియోగంలోకి తేవాలంటే తీసుకోవాల్సిన చర్యలపై పర్యాటకశాఖ సాంకేతిక అధికారులతో చర్చించారు. మ్యూజియం ఆవరణలో మద్యం దుకాణం ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ దుకాణాన్ని వేరే చోటికి మార్చటానికి కృషి చేస్తానన్నారు. పర్యాటక శాఖ అధికారులతో సమీక్షించనున్నట్లు చెప్పారు.

బంగారం మాయం కేసులో రుణగ్రహీతలకు హామీ పత్రాలు

సత్తెనపల్లి: బంగారం మాయంలో రుణ గ్రహీతలందరికీ ఎట్టకేలకు బ్యాంక్ అధికారులు హామీ పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇటీవల బ్యాంక్ మేనేజర్, గోల్డ్ అప్రైజర్ కలిసి బంగారం మాయం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో వారిరువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం 43 మంది రుణగ్రహీతలకు చెందిన 3149.42 గ్రాముల బంగారం మాయం కాగా దాని విలువ రూ.1.52 కోట్లుగా ఉంది. బంగారం మాయం కావడంపై రైతులు పలు విధాలుగా ఆందోళనలు చేపట్టారు. దీంతో బ్యాంక్ అధికారులు స్పందించి 43 మంది బంగారం రుణ గ్రహీతలకు బంగారం స్థూల బరువుపై 9 శాతం మేకింగ్ చార్జీలు, మూడు శాతం జీఎస్టీ కలిపి పరిహారం చెల్లించడానికి అంగీకరించి హామీ పత్రాలను అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చినగంజాం: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మంగళవారం ఇంకొల్లు మండలం ఇడుపులపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన గుంజి వీరాస్వామి(35) 12 ఏళ్ల క్రితం ద్రోణాదుల గ్రామానికి చెందిన లక్ష్మిని పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత నెల రోజుల నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలతో విడిగా ఉంటున్నారు. ఇంట్లో ఉరేసుకొని ఉండడంతో తండ్రి గుంజి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

పోలీసులకు ద్విచక్ర వాహనాలు ఎంతో ఉపయోగకరం

నరసరావుపేట: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తిరుపతి హీరో మోటార్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ అందజేసిన 20 ద్విచక్ర వాహనాలను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొ ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, ఏఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు పాల్గొన్నారు.